అందని ద్రాక్షలా పోలవరం ప్రాజెక్టు

ప్రాజెక్టు నిర్మాణం ఎత్తు తగ్గించి ఉత్తరాంధ్రని ఎడారి చేయొద్దు
సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు

విశాలాంధ్ర - విజయనగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు వరప్రసాదిని పోలవరం ప్రాజెక్టు నేడు అందని ద్రాక్షలాగా మారిపోయిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. కామేశ్వరరావు విమర్శించారు. పోలవరం ప్రాజెక్టును ఎత్తుని తగ్గించకుండా పాత డిజైన్‌లోనే నిర్మాణం పూర్తి చేయాలని, నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం ఉదయం విజయనగరం జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన దీక్ష నిర్వహించి మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఎడారిగా మారిపోవడానికి ప్రధాన కారణం అప్పర్ ప్రాజెక్టు నిర్మాణాలన్నారు. జగన్ పరిపాలనలో రైతులకు బటన్ నొక్కి పథకాలు అని చెప్పి మోసం చేస్తున్నారని అన్నారు. త్వరలోనే ప్రజలు ఓట్లు అనే బటన్ నొక్కి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పరిపూర్తికి రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షం వేసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించకుండా 45.72 మీటర్ల ఎత్తుతో పూర్తి స్థాయిలో నిర్మించాలని, అందుచేత జాతీయ ప్రాజెక్టు పోలవరం మినీ ప్రాజెక్టుగా మారుతుందని, దీని వలన ప్రాజెక్టు నీటి నిల్వ 196.60 టిఎంసి ల నుండి 92 టిఎంసిల కె పరిమితం కానుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 7.20లక్షల ఎకరాల సాగునీరు అందుతుందని, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్సులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ రంగారాజు, కోట అప్పన్న, బాయి రమణమ్మ, బుగత పావని, జిల్లా సమితి సభ్యులు ఎస్.సునీల్, పొందూరు అప్పలరాజు, కె. భీముడు, దేగల అప్పలరాజు, లెంక లక్ష్మీ పార్టీ సభ్యులు కాళ్ళ కృష్ణ, అప్పురుబోతు జగన్నాథం, బూర వాసు, ఎ.రాములు, వడ్డాది కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత: మంత్రి బొత్స

విశాలాంధ్ర - గరివిడి: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. విజయనగరం జిల్లాకు కేటాయించిన 19 వాహనాలను సోమవారం గరివిడి మండలం గరివిడి పోలీస్ స్టేషన్ ఎదురుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్క రికి నాణ్యమైన వైద్య సేవలు లక్ష్యంగా పనిచేస్తుం దని అన్నారు. ఎన్నడూ లేని విధంగా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని అన్నారు. 104 వాహనాలతో వైద్య సేవలు మరింత చేరువ అవుతాయని ఆయన పేర్కొన్నారు. జిల్లా పరిషత్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆలోచన ప్రతి ఒక్కరికి కూడా మేలు జరిగేలా ఉం టుందని వివరించారు. చీపురుపల్లి పరిధిలో ఉన్న శ్రీ ఆదర్శ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించిన బస్టాండ్‌ను మంత్రి బొత్స సత్యనారాయణ, బెల్లాన చంద్రశేఖర్ ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, చీపురుపల్లి ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వాకాడ శిరీష, గరివిడి మండల ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, మెరకముడిదం ఎంపీపీ తాడ్డి వేణు, మాజీ జడ్పీటీసీ కోట్ల వెంకటరావు, మాజీ ఎంపీపీ కొనిసి కృష్ణం నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయం గొప్పేమి కాదు: కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఈనెల 29వ తేదీ నుండి శంకుస్థాపన వారోత్సవాలు, ఏప్రిల్ 6వ తేదీ నుండి ప్రారంభోత్సవ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. సోమవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాసనమండలి ఎన్నికలో టీడీపీ విజయం సాధించడం ఏమంత గొప్ప విషయం కాదని అన్నారు. గెలుపోట ములపై ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే తమ పార్టీ తరఫున క్రాస్ ఓటింగ్‌కి పాల్పడ్డారన్న అభియోగమై సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం రాజకీయాలలో సాధారణమైన విషయమని అన్నారు. అయితే సస్పెండ్ అయిన సభ్యులు పశ్చాత్తాపానికి గురికాకుండా వైసిపిపై బురదజల్లే ప్రయత్నం విడ్డూరంగా ఉందన్నారు. బహిష్కృత సభ్యురాలు ఉండవల్లి శ్రీదేవి జగన్మోహన్ రెడ్డి బొమ్మతో గెలిచి పదవిని అలంకరించి అటుపిమ్మట కార్యకర్తలకు దూరమయ్యారని అన్నారు. సీనియర్ నాయకులు ఆనం రామనారాయణ రెడ్డికి పార్టీలు మారే అలవాటు ఎక్కువ అని ఎద్దేవా చేశారు. నగరంలో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. కుళాయిలకు ఆన్ ఆఫ్ స్విచ్‌లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

బాధిత కుటుంబాలను బెల్లాన పరామర్శ

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలోని జి.అగ్ర హారంలో బోడసింగిలి గోవిందరావు తల్లి, గుడ్ల శంకర్ తండ్రి మృతి చెంద డంతో ఆ కుటుం బాలను విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్ పరామర్శించారు. ఆయన వెంట చీపురుపల్లి సర్పంచ్ ప్రతినిధి మంగళగిరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొసిరెడ్డి రమణ, వార్డు మెంబర్ మహేష్, తదితరులు ఉన్నారు.

సీతంలో నూతన డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగల పరిధిలో గల సీతం కళాశాలలో నూతన డిజిటల్ లైబ్రరీ బ్లాక్‌ను మాజీ పార్లమెంట్ సభ్యురాలు, సత్యా విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మీ ప్రారంభించారు. 72 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ డిజిటల్ లైబ్రరీలోని కంప్యూటర్లకు అంతర్జాల సదుపాయంతో పాటు సెంట్రలైజ్డ్ ఏసి సదుపాయం కల్పిస్తూ, విద్యార్థులకు వివిధ కోర్సులకు సంబంధించిన ఐఈఈఈ, స్ప్రింగర్‌కు చెందిన ఈ-పుస్తకాలు, ఈ-జర్నల్స్, ఎన్ పి టి ఇ ఎల్‌కు చెందిన దృశ్య, శ్రవణ ప్రసంగాలు అన్ని అందుబాటులో తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మీ మాట్లాడుతూ వివిధ పాఠ్యాంశాలకు సంబంధించిన దృశ్య, శ్రవణ సందేశాలను వింటూ ఆయా సబ్జెక్టుపై పట్టు సాధిస్తూ తద్వారా ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచుకోవాలని చెప్పారు. సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి భూషణ్‌రావు మాట్లాడుతూ డిజిటలైజేషన్ దృష్ట్యా కళాశాలలో ఏర్పాటైన ఈ డిజిటల్ లైబ్రరీ సౌకర్యాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామ్మూర్తి, కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ లెంక సత్యవతి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పనులను తహశీల్దార్ పరిశీలన

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం'లో భాగంగా తెర్లాం మండలం నెమలాం రెవెన్యూ గ్రామ పరిధిలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను తహశీల్దార్ డి.రాజేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ సర్వే టీము ప్రభుత్వ భూములను రికార్డుల ప్రాప్తికై స్పష్టంగా కచ్చితంగా కొలతలు తీసుకొని భూ రికార్డులను తయారు చేయాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరమణ పాల్గొన్నారు.

గూడెం సహకార సొసైటీ నూతన భవనం ప్రారంభం

విశాలాంధ్ర - గుర్ల: మండలంలో 50 లక్షలతో నిర్మించిన గూడెం సహకార సొసైటీ నూతన భవనాన్ని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం సొసైటీలను అభివృద్ధి చేసి రైతులకు మేలు చేసే కార్యక్రమం ఈ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ పొట్నూరు ప్రమీల, సన్యాసినాయుడు, కె .వి సూర్యనారాయణ రాజు, జెడ్పీటీసీ శీర అప్పల నాయుడు, సొసైటీ అధ్యక్షులు బెల్లాన వెంకటరమణ, బంగారు నాయుడు, తహశీల్దార్ పద్మావతి, డీసీఎంఎస్ చైర్మన్ పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళా సంక్షేమ అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పొదుపు సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 3వ విడత కింద 10,018 మంది సభ్యులకు 5,76,23,633 రూపాయలు, మండలంలో 14,676 మంది సభ్యులకు 8,02,14,261/- రూపాయలు చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పొదుపు సంఘ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా శంబంగి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 78.94 లక్షల మంది పొదుపు సంఘాల మహిళల ఖాతాల్లో రూ.6,419.89 కోట్ల మొత్తాన్ని జమ చేస్తారని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, మండల అధ్యక్షులు శంబంగి లక్ష్మీ వేణు గోపాలనాయుడు, ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణు గోపాల్ నాయుడు, బుడా చైర్మెన్ ఇంటి పార్వతి గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: అక్క చెల్లమ్మల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. జగనన్న ఆసరా 3వ విడత సంబరాలు సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి మహిళల సాధికారికత కోసం అనేక పథకాలు అమలు చేసారని అ న్నారు. మండలంలో 1062 స్వయం సహా య సంఘాలకు 8.87 కోట్లు రూపాయలు వారి ఖాతాలో జమ చేయడం జరిగి ందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, ఎంపీటీసీ నీలంశెట్టి గోపమ్మ, కర్రి శ్రీను, గొరపల్లి శివ, ఎంపీడీఓ పద్మావతి, తహశీల్దార్, సీఐ బాల సూర్యారావు, సర్పంచ్ మచ్చ రామ స్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - బొబ్బిలి: నియోజకవర్గ పరిధి రామభద్రపురం మండల కేంద్రం హైవే పక్కన ప్రభుత్వ స్థలం ఆక్రమణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆర్డీఓ పి.శేషశైలజకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా నాయకులు పి.శంకరరావు, పీసీసీ సభ్యులు ముప్పల శ్రీనివాసరావు, జనసేన నాయకులు మహంతి ధనుంజయ్ మాట్లాడుతూ మండల రెవెన్యూ అధికారుల సహకారంతో అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేసి అమ్మేసుకుని సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. రూ.8కోట్లు విలువ చేసే స్థలాన్ని కాపాడాలని ఆర్డీఓను కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

గోస్తనీలో అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తే చర్యలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట మండలం, వేములాపల్లి వద్ద గల గోస్తనీ నదిలోని ఊట బావులు, బ్రిడ్జి సమీపంలో వాల్టా చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ డి.శ్రీనివాసరావు హెచ్చరించారు. తహశీల్దార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గోస్తనీ నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరగకుండా సోమవారం జేసీబీ సాయంతో నదికి వెళ్లే దారిని మూసేయిస్తూ అడ్డంగా కాలువ తవ్వించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఎవరైనా వాల్టా చట్ట నిబంధనలు ఉల్లంఘించినట్టయితే సంబంధిత ట్రాక్టర్లు, నాటు బళ్లను సీజ్ చేయటంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్సీ సురేష్ బాబుకి ఘనస్వాగతం

విశాలాంధ్ర - నెల్లిమర్ల: రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికైన పెనుమత్స సురేష్ బాబు తొలిసారిగా స్వగ్రామం నెల్లిమర్ల మండలం మొయిద గ్రామానికి సోమవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ బాబు ఆయన తండ్రి మాజీ మంత్రి కీర్తిశేషులు పెనుమత్స సాంబశివరాజు సమాధికి నివాళులర్పించారు. అనంతరం మాతృమూర్తి వెంకట రమణమ్మ నుంచి ఆశీస్సులు తీసుకున్నారు. ముందుగా సురేష్ బాబుకి గ్రామస్తులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సురేష్ బాబును నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. కార్యక్రమంలో నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, సర్పంచి అట్టాడ కృష్ణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

ఉత్తరాంధ్రలో శాంతిభద్రతలు ప్రశాంతం

డీఐజీ హరికృష్ణ

విశాలాంధ్ర - సీతానగరం: ఉత్తరాంధ్ర జిల్లాల్లో శాంతిభద్రతలు ప్రశాంతంగా ఉన్నాయని విశాఖ డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు. సోమవారం పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం సర్కిల్ పరిధిలో సీతానగరం పోలీస్ స్టేషన్ తనిఖీ నిమిత్తం విచ్చేశారు. మన్యం జిల్లాలో ప్రశాంత వాతావరణం ఉందని తెలిపారు. గంజాయి రవాణా గూర్చి విలేకరులు ప్రస్తావించగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 8 మండలాల్లో 2021లో సుమారు 7వేల500 ఎకరాల్లో పం టలను గుర్తించి దగ్ధం చేసినట్లు చెప్పారు. గతఏడాది కూడా దాడులు నిర్వహించి చాలా ప్రాంతాలలో గంజాయి సాగును ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం ద్వారా ఆయా మండలాల్లో ప్రత్యా మ్నాయ మార్గాలను గిరిజనులకు చూపిస్తూ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒడిశాలో గంజాయి సాగు వల్ల మనవైపు అక్రమంగా రవాణా జరగడంతో పోలీ సుల ముమ్మర తనిఖీలు వల్ల ఎక్కువ కేసులు నమోదు జరుగుతున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో నక్సల్ ప్రభావితం పూర్తిగా లేదని ఆయన చెప్పారు. పలు పోలిస్ స్టేషన్ల మరమ్మతులు, సిబ్బంది క్వార్టర్ల నిర్మాణాలు గూర్చి పోలీస్ కార్పొరేషన్‌కు ప్రతిపాధనలు పంపిస్తున్నట్లు తెలిపారు. మొదటిసారిగా విచ్చేసిన డిఐజి హరికృష్ణకు పోలీసులు గౌరవ వందనం ఇచ్చి సెల్యూట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఓ.దిలీప్, పార్వతీపురం డీఎస్పీ ఏ.సుభాష్, ఎస్బి సిఐ శ్రీనివాసరావు, పార్వతీపురం సర్కిల్ గ్రామీణ, పట్టణ సిఐలు విజయా ఆనంద్, కృష్ణారావు, సీతానగరం, బలిజిపేట ఎస్ఐలు నీలకంఠం, ప్రశాంత్ కుమార్, ఏఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో స్పందన

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లా పోలీస్ కార్యాలయంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఓ.దిలీప్ కుమార్ స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అదేశాలు మేరకు సోమవారం నిర్వహించారు. దీనిద్వారా 11 స్పందన ఫిర్యాదులు స్వీకరించగా, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ స్పందన కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి బి. నాగేశ్వరరావు, ఎస్బి సిఐ ఎన్.శ్రీనివాసరావు, డిసిఆర్ బి, ఎస్ఐ. పి.దినకర్‌లు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించడం అన్యాయం: సీపీఐ

విశాలాంధ్ర - బెలగాం: పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించకుండా సక్రమంగా పూర్తి చేయాలని కోరుతూ ఈ నెల 26, 27 తేదీల్లో సిపిఐ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న కార్యక్రమంలో భాగంగా సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఐ జిల్లా పార్టీ ఆధ్వ ర్యంలో నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా సీపీఐ కార్యదర్శి కూరంగి మన్మధరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును సక్రమంగా పూర్తి చేయకుండా రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేందుకు ప్రయత్ని స్తున్నదని, పోలవరంపై కేంద్రం పదేపదే అన్యాయం చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకుండా చోద్యం చూస్తోం దన్నారు. పోలవరం ఎత్తు తగ్గించడంవలన రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేవరకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్య క్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, ఈవి నాయుడు, పువ్వల ప్రసాద్, కూరంగి గోపి, వెంకట్రావు, రంగారావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస క్వారీ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ఒకరికి గాయాలు

విశాలాంధ్ర - సాలూరు రూరల్: మండలంలో కొత్తవలస వద్ద ఉన్న విజయస్టోన్ క్రషర్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం మధ్యాహ్నం క్వారీ పై భాగంలో కార్మికులు పనిచేస్తుండగా వర్షం కురవడంతో కార్మికులు తమ పరికరాలను అక్కడే విడిచిపెట్టి కిందకు వచ్చేశారు. వర్షం తగ్గిన వెంటనే పరికరాలను తెచ్చుకు నేందుకు క్వారీ పైకి వెళ్లగా అదే సమయంలో ఒక పెద్ద రాయి ఒక కార్మికుడిపై పడటంతో అక్కడికక్కడే మరణిం చాడు. ఆ రాయి విడివిడిగా చీలి వేరొక వ్యక్తి పైకి దొర్ల డంతో పై నుంచి కిందకి దొర్లుకుంటూ వచ్చి మృతి చెందాడు. మూడో వ్యక్తి భుజానికి రాయి తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న క్వారీ సూపర్‌వైజర్ రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే రూరల్ యస్సై ప్రయోగమూర్తి తన సిబ్బందితో కలసి క్వారీ వద్దకు చేరుకున్నారు. మృతదేహాలను సాలూరు కమ్యూనిటీ హాస్పిటల్‌కు తరలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీ సూపర్ వైజర్ అందించిన సమాచారం మేరకు ఒడిషా రాష్ట్రం మల్కనగిరి జిల్లాకు చెందిన సుజిత్, సోమ అను యువకులు ఆదివారం క్వారీ పనులలో చేరారన్నారు. పనిలో కుదిరిన మరుసటి దినమే ప్రమాదవశాత్తు మరణించారన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామన్నారు.

టిడ్కో గృహప్రవేశాలపై జమ్మాన సమీక్ష

విశాలాంధ్ర - బెలగాం: వివిధ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు శ్రీకాకుళం, గుడివాడ, గుంటూరు, నర్సరావుపేట, కందుకూరు, పొన్నూరు, కావలి, ఆళ్లగెడ్డ, ధోన్, యలమంచిలి, పిఠాపురం పట్టణాలలో 40 వేల టిడ్కో గృహ ప్రవేశాలకు సంబందించి ముందస్తు కార్యాచరణపై ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ టిడ్కో మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ శ్రీధర్, బోర్డ్ డైరెక్టర్లు, చీఫ్ ఇంజినీర్ గోపాల క్రిష్ణమూర్తి, మరియన్నలతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఇంకనూ గృహ ప్రవేశాలు చేయవలసి ఉన్న ప్రాంతాలలో నిర్ణీత కాల వ్యవధి లోపల ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు సంబంధిత కాంట్రాక్టింగ్ ఏజెన్సీ వారితో ఎప్పటికప్పుడు మాట్లాడి సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలన్నారు. రాష్ట్రం మొత్తం మీద వివిధ కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల వారీగా నేటివరకు లబ్ధిదారుల పేరిట జరిగినటువంటి ఇళ్ళ రిజిస్ట్రేషన్స్, రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత అదే విధంగా వారి పేరిట విద్యుత్ కనెక్షన్లు అనేటటువంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో డైరెక్టర్‌లు రాఘవరావు, నాగేశ్వరమ్మ, నవరత్నాలు, నోడెల్ ఆఫీసర్ విజయకుమార్, జనరల్ మేనేజర్ జి.హరనాథ్ బాబు, చీఫ్‌అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసరాజు, ఇతర రాష్ట్ర కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

104 వాహనాలను ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

విశాలాంధ్ర - సాలూరు రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించిన పదకొండు 104 వాహనాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర సోమవారం ప్రారంభించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మన్యం జిల్లాకు పదకొండు 104 వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన చెప్పారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వైద్య సేవలు గణనీయంగా మెరుగు పడ్డాయన్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో ఓపీ రోజుకు మూడు వందల వరకు పెరిగిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు జరజాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బగాది జగన్నాథరావు, 104 నోడల్ అధికారి డా.వినోద్ కుమార్, వైద్య శాఖ అధికారులు డి.వి.రమణ, ఏ.శ్యామ్ కుమార్, జిల్లా మేనేజర్ దుర్గా ప్రసాద్, వైసీపీ సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, జరజాపు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాటల ప్రభుత్వం కాదు...చేతల ప్రభుత్వం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కురుపాం: ఇచ్చిన మాటల్ని గాలికి వదిలేసే ప్రభుత్వం కాదని... ఇచ్చిన ప్రతీ హామీ అమలు చేసే చేతల ప్రభుత్వం తమదని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. సోమవారం కురుపాంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం ఏపీఎం ఈ.కిషోర్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 624మహిళా సంఘాలకు చెందిన మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్ మూడు కోట్ల ముప్పై మూడు లక్షల ఒక వెయ్యి తొంభై నాలుగు రూపాయలను అందజేసినట్టు తెలిపారు. అలాగే 112 మహిళా సంఘాలలో 1344 మందికి బ్యాంకు లింకేజీ సున్నా వడ్డీ రెండు కోట్ల 75 లక్షల విడుదల చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జడ్పీటీసీ జి.సుజాత, సర్పంచ్ జి.సుజాత, జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ షేక్ నిషార్, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపీటీసీలు బంగారు నాయుడు, స్వామి యాజులు, సంతోషి, మాజీ ఎంపీపీ ఇందిరా కుమారి, మాజీ ఎఎంసి చైర్మన్ వెంకటరావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ సురేష్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, గ్రీవెన్స్ విభాగం అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

విశాలాంధ్ర - మక్కువ: గృహ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ అన్నారు. మండలంలోని గృహ నిర్మాణాలపై మక్కువ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పీఓ సమీక్షించి మాట్లాడారు. లబ్ధిదారులను మోటివేట్ చేయాలని, త్వరగా నిర్మాణాలు చేయుటకు అన్ని విధాలా సహకరించాలని ఆదేశించారు. మౌళిక సదుపాయాల కల్పనకు జిల్లా కలెక్టర్ పనులు మంజూరు చేసిన మేరకు పనులు పూర్తి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీరు, ఇంజినీరింగ్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విద్య, ఉపాధికి దేవాలయాలు

విశాలాంధ్ర - వేపాడ: ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేసుకోగలిగితే సన్మార్గంలో నడిచే యువతకు విద్య ఉపాధి సాధ్యపడు తుందని స్వర్గీయ ఏడువాక గంగరాజమ్మ మెమోరియల్ గ్రంథాలయం వ్యవస్థాపకులు వైకే నాయుడు అన్నారు. మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో ఈ గ్రంథాలయం ఏర్పాటు చేసి పదేళ్లు అయిన సందర్భంగా సోమవారం గంగరాజమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైకే నాయుడు మాట్లాడుతూ ఈ పదేళ్ల కాలంలో ఈ గ్రంథాలయంలో చదువుకున్న ఎందరో విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో రాణించడమే కాకుండా పదుల సంఖ్యలో యువకులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ వేడుకల్లో పలువురు గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం వేలం

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం సీసాలతో రవాణా చేస్తూ పట్టుబడిన ఒక మోటార్ సైకిల్‌కు వచ్చేనెల 1వ తేదీన వేలం వేయనున్నట్టు చీపురుపల్లి పోలీసులు సన్యాసినాయుడు తెలిపారు. AP 30 AM 2629 అను నెంబర్ గల Yamaha Fascino అను కంపెనీ గల మోటార్ సైకిల్‌కు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు శనివారం చీపురుపల్లి పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించబడు పబ్లిక్ ఆక్షన్‌కు హాజరు కావాలని కోరారు.

చెట్టుపై నుంచి పడి యువతికి గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : చెట్టుపై నుండి ప్రమాదవశాత్తు జారిపడిన యవతికి తీవ్ర గాయాలైన సంఘటన జరిగింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమరాడ మండలం సంకేసు గ్రామానికి చెందిన మండంగి లక్ష్మి కూలి పని చేసుకొని ఉంటుంది. జీడితోటలి జీడిపిక్కలు సేకరించడానికి చెట్టుపైకి ఎక్కి జీడీ పిక్కలు ఏరుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెట్టు పైనుండి క్రింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన ఆమె బావ మెల్లక పకీరు ఆటోలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకుని రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

పురుగుమందు తాగి వ్యక్తి అస్వస్థత

విశాలాంధ్ర - బెలగాం : కూల్ డ్రింకు అనుకొని పొరపాటున పురుగుల మందు తాగి వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన జరిగింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలం దుమ్మంగి గ్రామానికి చెందిన బిడ్డిక పాపారావు జీడితోటలో జీడిపిక్కలు ఏరుతుండగా అతని భార్య బిడ్డిక స్వర్ణ కూల్ డ్రింకు బాటిల్‌లో సుమిదా అనే పురుగుల మందు తీసుకుని రాగా పాపారావు కూల్ డ్రింకు అనుకుని పొరపాటున సేవించి అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన అతని భార్య గుమ్మ లక్ష్మీపురం పి.హెచ్.సికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

చెత్త నిర్వహణపై శిక్షణ

విశాలాంధ్ర - చీపురుపల్లి: కర్లాంలో సంతకవిటి మండలానికి సంబంధించి మండా కూరిటి, వాసుదేవ పట్నం, రేగిడి ఆముదాలవలస మండలనకు సంబంధించి సోమ రాజుపేట, ఆముదలవలస సచివాలయ సిబ్బందికి, సర్పంచ్‌లకు, గ్రీన్ అంబాసిడర్‌లకు చెత్త నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. తడి చెత్తను, పొడి చెత్తను ఇంటి నుండి ఎలా సేకరించాలి, సేకరించిన చెత్తను వర్మీ కంపోస్టుగా ఎలా ఉత్పత్తి చేయాలి అనే దానిపై అవగాహన కల్పించారు. గ్రామంలో మృతిచెందిన జంతువులను పూడ్చడానికి కేటాయించిన ఒక స్థలాన్ని చూపించారు. బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌కు ఏర్పాటు చేసిన ఒక యార్డ్‌ను చూపించి వివరించారు.

అనిల్ నీరుకొండ వైద్యశిబిరం

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో విశాఖకు చెందిన అనిల్ నీరుకొండ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమ వారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరం విజయవంతం అయింది. ఆస్పత్రికి చెందిన వైద్యులు హర్షిని, రోజా, అక్షన్ కియా, సంతోష్, జనిత్‌లతో పాటు మరో తొమ్మిదిమంది వైద్యసిబ్బంది పాల్గొన్నారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 185 మంది రోగులు హాజరుకాగా వారందరికీ ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్యశిబిరంలో గ్రామ సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీ సభ్యులు ఆకుల సత్యనారాయణ, మండల వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో స్పందన

విశాలాంధ్ర - తెర్లాం: మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెపుదాం (స్పందన) కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఫిర్యాదు దారుని యొక్క ఫిర్యాదు ఆర్థికేతరమైనది అయితే అటువంటి వినతులను సత్వరమే మండల స్థాయిలోనే పరిష్కారం చూపి సంతృప్తి పరచడం జరుగుతుందని, ఆర్థిక పరమైన విషయములపై వచ్చిన ఫిర్యాదులు కమిటీ ద్వారా సూచించబడి ఉన్నతాధికారుల యొక్క చర్యల కొరకు సిఫార్సు చేయబడుతుందని తెలియజేసారు. అలాగే ప్రజలు గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా జిల్లాలో నిర్వహించే గ్రీవెన్స్‌కు వెళ్ళకుండా మండల స్థాయిలోనే గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేసుకోవాలన్నారు.

గజపతినగరం: గజపతినగరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పప్పు సుదర్శనం తాసిల్దార్ అరుణ కుమారి, ఇతర మండల స్థాయి అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపర్చడమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర విద్యా శాఖామంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర - వంగర: ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. వంగర మండల కేంద్రంలో రూ.90 లక్షలతో కొత్తగా నిర్మించిన తహశీల్దార్ కార్యాలయాన్ని, రూ.12.5 లక్షలతో ఆధునీకరించిన కోల్డ్ స్టోరేజ్‌ని, రూ.15.5 లక్షలతో ఆధునీకరించిన వ్యవసాయ వృత్తిదారుల సంఘ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడికి సమీపంలో ఏర్పాటు చేసిన సభలో వైఎస్సార్ ఆశరా పథకం క్రింద మూడవ విడత పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. మండలంలోని 772 సంఘాలకు చెందిన 8,306 మంది మహిళలకు రూ.5,55,00,000 విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ తమది చేతల ప్రభుత్వమని, ఏదైతే చెబుతామో...దానిని చేసి చూపిస్తామని అన్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబులా ప్రజల్ని మోసం చేసే అలవాటు తమకు లేదని అన్నారు. ప్రజలు తమచుట్టూ జరుగుతున్న అభివృద్ధిని, అమలు జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాలను గమనించాలని కోరారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం ఉండాలన్నారు. వంగర గ్రామంలో సచివాలయ భవనం పూర్తి చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ భవనం పూర్తి అయితే, గ్రామానికి మరింత మెరుగైన సేవలు అందుతాయని సూచించారు. రాజాం ఎంఎల్‌ఏ కంబాల జోగులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, ఆర్‌డిఓ అప్పారావు, శ్రీకాకుళం జెడ్‌పి వైస్ ఛైర్మన్ జగన్మోహనరరావు, జెడ్‌పిటిసి కరణం రాధ, ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జి, తాశిల్దార్ ఐజాక్, ఎంపిడిఓ వి.శ్రీనివాసరావు, పలువురు మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మెగా పవర్ స్టార్ రాంచరణ్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ప్రముఖ యువ నటుడు, మెగా పవర్ స్టార్, గ్లోబల్ స్టార్ రాంచరణ్ పుట్టినరోజు వేడుకలను సోమవారం జిల్లా చిరంజీవి యువత, అంజనీ పుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా చిరంజీవి యువత, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు త్యాడ రామకృష్ణారావు(బాలు), అంజనీ పుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం అధ్యక్షుడు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్ నిర్వహించారు. ముందుగా రాంచరణ్ గోత్రనామాలతో కామాక్షి నగర్‌లో శ్రీ లక్ష్మి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు సర్వమత ప్రార్ధనలు నిర్వహించి, కామాక్షి నగర్ రెండవ లైన్‌లో మొక్కలు నాటారు. అనంతరం కామాక్షి నగర్‌లోని శ్రీ ప్రసన్న స్కూల్లో పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ సంఘసేవకులు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు గురాన అయ్యలు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ కర్రోతు సత్యం హాజరై కేక్ కట్ చేసి విద్యార్థినీ, విద్యార్థులకు బిస్కెట్స్, చాక్లెట్స్ పంచిపెట్టారు. అనంతరం కంటోన్మెంట్‌లో ఉన్న పలువురు నిరాశ్రయులకు ఆహార పొట్లాలను కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, నలమారాజు, లోక్ నాథ్ పంచిపెట్టారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి జిల్లా కంటి వైద్య శిబిరాల కో ఆర్డినేటర్ పి.సురేష్, ఆప్తాల్మిక్ టెక్నీషియన్ బి.హేమలత సేవలందించిన ఈ శిబిరంలో శ్రీ ప్రసన్న స్కూల్ ఉపాధ్యాయులు మహేష్, శివాజీ, జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆదాడ మోహనరావు, జనసేన నాయకులు తుమ్మి అప్పలరాజు దొర, ప్రగతి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, చిరంజీవి యువత, జనసేన పార్టీ సీనియర్ నాయకులు లాలిశెట్టి రవితేజ, ఎంటి రాజేష్, పవన్, చుక్క రవికుమార్, భాష, రవి, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ కళాశాలలో
డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కేంద్రాన్ని మూసివేయడం దుర్మార్గం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: దూర విద్యా కేంద్రం మూసివేసి జిల్లాలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు ఆ విద్యను దూరం చేసే విధంగా ప్రభుత్వం పావులు కదపడం దారుణమని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. దీనిని తిరిగి ప్రారంభించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్ పావని మాట్లాడుతూ జిల్లాలో గత 30 సంవత్సరాలుగా విద్యార్థులు ఈ దూర విద్యా కేంద్రం ద్వారా తమ విద్యను కొనసాగిస్తున్నారని, ఉత్తరాంధ్ర జిల్లాలలో అనేకమంది విద్యార్థులకు చదువు, ఉపాధి ఒకేసారి చేయవలసిన ఆర్థిక పరిస్థితి రీత్యా దూరవిద్యా కేంద్రంలో అడ్మిషన్లు పొందుతూ తమ చదువును కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో ఎంఆర్ కళాశాలలో ఉన్న దూర విద్యా కేంద్రాన్ని తిరిగి ప్రారంభించే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము, ఎం సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

పెదబోగిలిలో రెండురోజులపాటు శిక్షణ కార్యక్రమాలు

విశాలాంధ్ర - సీతానగరం: మన్యం జిల్లాలోని పార్వతీపురం నియోజక వర్గంలోని గ్రీన్ అంబాసిడర్లకు, పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు, ఇంజినీరింగ్, వ్యవసాయశాఖ సహాయకులకు ఈనెల 28, 29 తేదీల్లో రెండు రోజులపాటు బ్యాచులవారీగా పెద బోగిలి చెత్త సంపద కేంద్రం వద్ద శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని లచ్చయ్యపేట గ్రామ పంచాయతీనీ, చెత్త సంపద కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆయన మాట్లాడుతూ చెత్తను తరలించడం చేస్తున్న హరిత రాయబారులకు పంచాయతీల నుండి15వ ఆర్థిక సంఘం నుండి డబ్బులు చెల్లించాలని కోరారు. పూర్తిగా ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఇంటి పన్నులు రూ.4కోట్ల 86లక్షల డిమాండులో ఇంతవరకు రూ. కోట్ల 2లక్షల రూపాయలు వసూలు చేయడం జరిగిందని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పెదబోగిలి మేజర్ పంచాయతీలోనీ చెత్తసంపద కేంద్రం నిర్వహణ, వానపాముల పెరుగుదల, వ్యర్థ పదార్థాలతోను, చెత్తతో తయారు చేస్తున్న సేంద్రియ ఎరువుల పట్ల, వర్మీ ఉత్పత్తిని గమనించి అన్ని గ్రామాలలో ఇదేవిధంగా చెత్త సంపద కేంద్రంలను తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓపిఆర్డీ వర్మ, పంచాయతీ సెక్రటరీ మురళిసచివాలయం ఉద్యోగులు , గ్రీన్ అంబాసిడర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ కార్మికుల వేతన ఒప్పంద చర్చలు సఫలీకృతం

విశాలాంధ్ర - శృంగవరపుకోట: యాజమాన్యంతో క్వారీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన వేతన ఒప్పందం చర్చలు సఫలీకృతమయ్యాయి. కుదిరిన అగ్రిమెంట్ ప్రకారం ఫిబ్రవరి 23 నుంచి జనవరి 2029 వరకు దశలవారీగా వేతనాలు పెంచుతూ తీర్మానం చేసుకున్నారు. మొదటి సంవత్సరం ప్రస్తుతం ఉన్న జీతంపై రూ.1500 పెంచేందుకు అంగీకరించారు. అలాగే రెండవ సంవత్సరం రూ.1500 పెంచేందుకు క్వారీ యాజమాన్య ప్రతినిధులు అంగీకరించారు. మూడవ సంవత్సరం గత పాత జీతంపై 1000 రూపాయలు, నాలుగవ సంవత్సరం, 5వ సంవత్సరం, 6వ సంవత్సరం వెయ్యి రూపాయల చొప్పున పెంచేందుకు అంగీకరించారు. ఇక కార్మికులు రోజు ఎనిమిది గంటలు పని చేయాలని అంగీకారం జరిగింది. కార్మికులకు నెలసరి జీతం ప్రతి నెల 15వ తేదీకి యాజమాన్యం ఇచ్చేందుకు అంగీకరించారు. ఈ అగ్రిమెంట్ చర్చల్లో యాజమాన్య ప్రతినిధులు పి.వెంకట్రావు, వి.దివాకర్, ఏ.నరేష్, ఆర్.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేషు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, సిఐటియు ఎస్.కోట మండల కమిటీ నాయకులు చెలికాని ముత్యాలు, క్వారీ కార్మిక సంఘ నాయకులు ఎర్రప్రగడ భాస్కరరావు, పోకల భాస్కరరావు, గోకాడ శ్రీను, గేదుల కృష్ణ బురిడీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడ్డ నలుగురు అరెస్ట్

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్: స్థానిక బాలాజీ మార్కెట్లో గల షాపు నంబరు 304లో చోరీకి పాల్పడిన నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. వెంకటరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం సీఐ వెల్లడించారు. ఈనెల 23వ తేదీన షాపు యజమాని అరుణ్ కుమార్ అగర్వాల్ మూసివేసి ఇంటికి వెళ్లిన తర్వాత ఎవరో గుర్తు తెలియని దొంగలు మారు తాళంతో షాపు షట్టరు తలుపు తీసి, లోపలకు ప్రవేశించి, దఫ దఫాలుగా సుమారు రూ.1.90 లక్షల విలువైన బట్టల మూటలు దొంగిలించి పారిపోయినట్లు షాప్ యజమాని 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు1వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా బొండపల్లి మండలం జియ్యన్నవలసకు చెందిన చుక్క పడాల శంకర్, ఎర్ర శ్రీను, పట్నాల అప్పల నాయుడులను 1వ పట్టణ పోలీసులు గుర్తించి, వారి వద్ద నుండి రూ.75 వేలు నగదు, 10 నైటీ మూటలను స్వాధీనం చేసుకుని, నిందితులు నలుగురిని రిమాండుకు తరలించినట్లుగా సిఐ వెంకటరావు తెలిపారు. ఈ కేసును చేదించడంలో 1వ పట్టణ ఎస్ఐలు అశోక్ కుమార్, భాస్కరరావు, హెచ్.సి. అచ్చిరాజు, సిబ్బంది క్రియాశీలకంగా పని చేశారని సిఐ తెలిపారు.



ఉచిత కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట మండలం తలారి సచివాలయం పరిధిలో కొట్టాం వైద్య సిబ్బంది నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలు విజయవంతమయ్యాయి. డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా 3వ దశలో 60 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఎస్.కోట తలారి సచివాలయం పరిధిలోని చుక్కవానిపాలెం గ్రామంలో కొట్టాం పీహెచ్‌సీ ఆప్తమాలిక్ అసిస్టెంట్ అనుపమ 93 మందికి సోమవారం ఉచిత కంటి పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్సలు అవసరం పడిన వారికి విజయనగరం మహారాజ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు హాజరయ్యారు.

కార్పెంటర్స్ డే వేడుకలు

విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరంలోని కార్పెంటర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గజపతినగరం తాసిల్దార్ కార్యాలయం మండల పరిషత్ కార్యాలయం లలో మరమ్మతులు చేపట్టారు. మండల తహశీల్దార్, ఉప తహశీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పప్పు సుదర్శనం గజపతినగరం జెడ్పీటీసీ కార్పెంటర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొమ్మోజు అప్పలాచారి, రాష్ట్ర కార్యదర్శి అల్లూరి గణేష్, కోశాధికారి సింహాద్రి, సన్యాసిరావు, దివిలి గౌరీ, శంకర్రావు, పొందూరు కడియాల కృష్ణ, పారాది సూరిబాబు, ఆడికి తోట రాజు, వీరాచారి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీ శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారిచే రచించబడిన త్రైత సిద్ధాంత కాలమాణిని సోమవారం పట్టణంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిచే త్రైత సిద్ధాంతం వారి త్రైత శక నూతన క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నెలలతో కూడిన ఈ క్యాలెండర్ చైత్ర మాసంతో ప్రారంభమై, గొప్ప గొప్ప జ్ఞాన వాక్యాలను తెలిపే విధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రబోధసేవా సమితి, ఇందూజ్ఞాన వేదిక, విజయనగరం శాఖ సభ్యులు శంకర రావు, సి వి ఎస్ నాయుడు, వంశీ, రాజప్పడు, తరుణ్,దుర్గారావు , ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నగరాభివృద్ధే ధ్యేయం: మేయర్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగరాభివృద్ధే ధ్యేయంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారని మేయర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన మేయర్ విజయలక్ష్మి అజెండాలోని అంశాల వారీగా సభ్యులు అభిప్రాయాలను స్వీకరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను నగరంలో చేపట్టబోయే అభివృద్ధి పనులు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అవసరమైన 45 అంశాలను పొందు పరిచామన్నారు. అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలపడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో కమిషనర్ ఆర్ శ్రీ రాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు పట్నాన పైడ్రాజు, బి ధనలక్ష్మి, విన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలందించాలి

విశాలాంధ్ర - బెలగాం: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి పూర్తి స్థాయిలో ప్రజలకు వైద్య సేవల అందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు ఆయన సూరంపేటలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో కార్యక్రమానికి ముందురోజు ప్రణాళిక వేసుకొని ప్రజలందరికీ తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి కె.శిరీష, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులకు సత్కారం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ప్రపంచ రంగస్థల దినోత్సవ సందర్భంగా సోమవారం సాయంత్రం గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం చారిటబుల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ముగ్గురు రంగస్థల కళాకారులను సత్కరించి, ఆర్థిక సహాయం అందించారు. బేల పద్మశ్రీ, రాజు, కర్రోతు జగ్గారావు అనే ముగ్గురు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న కళాకారులను ఎంపిక చేసి, ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు చొప్పున, కోట వద్ద ఆనందా ఎన్క్లేవ్ ప్రాంగణంలో అందజేశామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రాధిక మంగిపూడి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, ఉపాధ్యక్షుడు కేఆర్‌కే రాజు, కుటుంబరావు, ఝాన్సీ, రుక్మిణి, రంగస్థల కళాకారుల సంఘం తరఫున సంగీత కుమార్ తదితరులు పాల్గొన్నారు

స్పందనకు 163 వినతులు

విశాలాంధ్ర - విజయ నగరం: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెపుదాం (స్పందన) కార్య క్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 163 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 123 ఉన్నాయి. హౌసింగ్‌కు 10, మున్సిపల్ శాఖ కు 07, వైద్య శాఖకు 6, సచివాలయాలకు సంబంధించి 11 అందగా, మిగిలినవి ఇతర శాఖలకు చెందిన వినతులు, పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. జె.సి మయూర్ అశోక్, డి.ఆర్.ఓ గణపతి రావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు, సూర్యనారాయణ, సుదర్శన దొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

సూరంపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం

విశాలాంధ్ర - బెలగాం: సీతానగరం మండలం సూరంపేట గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డా. టి.జగన్మోహనరావు సందర్శించారు. ఓపి నిర్వహణ రికార్డులను, రక్త పరీక్షలను, దీర్ఘ కాలిక రోగుల తనిఖీల పర్యవేక్షణ కార్డులను పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలపై అక్కడకు వచ్చిన ప్రజలతో మాట్లాడి ఆరోగ్య సూచనలు, సలహాలు అందచేశారు. గ్రామంలో వైద్య సేవలు వినియోగించుకున్న వారి వివరాలను పక్కగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, అదేవిధంగా అదేరోజు ఆన్లైన్ నమోదు పూర్తి చేయాలని, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు అందుకొన్నవారు కదలలేని స్థితిలో ఉన్న వారి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి కె.శిరీష, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గారావు, ప్రసాద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణను గుర్తించిన రెవెన్యూ

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర - వేపాడ: ప్రభుత్వ భూముల్లో అక్రమ రాతి క్రషర్ నిర్మాణం అనే శీర్షికన విశాలాంధ్ర దినపత్రికలో సోమవారం వెలువడిన కథనానికి మండల తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజు స్పందించి సోమవారం తన సిబ్బందితో ఆక్రమణకు గురైన ప్రదేశానికి చేరుకొని సచివాలయం సర్వేయర్లు సాయి, శివలతో సర్వే చేశారు. వావిలపాడు రెవెన్యూలో సర్వే నంబరు 93-1లో సుమారు 0.50 సెంట్లు ప్రభుత్వ భూమిని, సర్వే నెంబరు 94లో సుమారు 0.59 సెంట్లు ప్రభుత్వ పోరంబోకు భూమిని ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. అయితే ఆ భూమిలో ఎన్ కే సి సంస్థ రాతి క్రషర్ కు సంబంధించి కంటైనర్లు క్వారీ మెటీరియల్ లు ప్రభుత్వ భూమి ఆక్రమించి వేయడం అందులో మెటీరియల్ ఉన్నట్లు గుర్తించి తక్షణమే వాటిని తొలగించి ప్రభుత్వ భూమిని ఖాళీ చేయాలని తహసిల్దార్ ఎస్ కృష్ణంరాజు ఆదేశించారు. ఎన్ కే సి సంస్థ క్రసర్ వర్కర్లు ఆ భూమిని ఓ యజమాని దగ్గర లీజుకి తీసుకోవడం జరిగిందని చెప్పడంతో భూ యజమాని నాగులపల్లి సతీష్‌కి గతంలో కూడా ఆక్రమం తొలగించి అప్పుడే చెప్పడం జరిగిందని మరల ప్రభుత్వ భూములు ఆక్రమించి లీజుకి ఇవ్వడంతో ఆగ్రహించిన తహశీల్దార్ భూ యజమానిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే ప్రభుత్వ భూమి చుట్టూ పెగ్గలు వేసి ప్రభుత్వ భూమి ఆక్రమించిన వారు శిక్షార్హులని బోర్డులను ఏర్పాటు చేయాలని అలాగే ప్రభుత్వ గెడ్డపై వేసిన రోడ్డును తొలగించాలని వీఆర్వో రామానుజంకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉప తహసీల్దార్ కే.సన్యాసినాయుడు వీలుపర్తి వీఆర్ఏ రాము రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం: మంత్రి బొత్స

విశాలాంధ్ర - గుర్ల: ప్రతి పేదవాడికి, ప్రతి పేద కుటుంబానికి ఈ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో అందించడంతోపాటు ప్రజల మధ్య నిరంతరం తాము ఉంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎంపీపీ పొట్నూరు ప్రమీల, సన్యాసి నాయుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వి సూర్యనారాయణ రాజు, జెడ్పీటీసీ అప్పల నాయుడు, జిల్లా కలెక్టర్ సూర్యకళ, డిఆర్డిఏ పిడి కళ్యాణ్ చక్రవర్తి, ఎంపీడీవో కళ్యాణి, తాసిల్దార్ పద్మావతి, ఏపిఎం నారాయణరావు, ఏరియా కోఆర్డినేటర్ సీతారామయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి: యూటీఎఫ్

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం మండలంలో పని చేస్తున్న గిరిజన, మహిళా ఉపాధ్యాయులపై వివక్ష చూపుతున్న ఎంఈఓ పివి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మురళీమోహన్‌రావు మాట్లాడుతూ పార్వతీపురం ఎంఈఓ పివి ప్రసాద్ బాధ్యతలు తీసుకున్న నాటి నుండి ఉపాధ్యాయులపై కక్షసాధింపులు, వేధింపులు, వివక్షత చూపుతున్నారని, అనేకసార్లు పై అధికార్లకు తెలియజేసినప్పటికి చర్యలు లేవన్నారు. గిరిజన ఉపాధ్యాయులు మర్రి రాము, కోలక భాగ్యవతిల సమస్యలు పరిష్కరించకుండా వివక్షత చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టీ. రమేష్, జిల్లా కోశాధికారి కె. మురళీ, మండల నాయకులు వి. వసంతనాయుడు, బి. జగన్నాథం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్పందనకు 110 ధరఖాస్తులు

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 110 దరఖాస్తులు వచ్చాయని జాయింట్ కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సంయుక్త కలెక్టర్ ఓ.ఆనంద్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, డి.ఆర్.డి.ఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పలనాయుడులు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జియ్యమ్మవలస మండలం అర్నాడవలస గ్రామానికి చెందిన ఎం.సురేష్ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేనందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, మా గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. పార్వతిపురంమండలం బాలగుడబ గ్రామంలో లంకెలచెరువు మీద ఆధారపడి కొన్ని సంవత్సరాలుగా గ్రామ రైతులు జీవనం సాగిస్తున్నామని, లంకెలచెరువు ఆక్రమణదారులనుండి కాపాడి ఆయుకట్టుదారులకు నీటిసదుపాయం కల్పించాలని జె.ప్రసాద్, ఇతరులు దరఖాస్తు అందజేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌ను ప్రారంభించిన మంత్రి బొత్స

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి ఆదర్శ డిగ్రీ కాలేజ్ బస్ షెల్టర్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనువాస్‌రావు, విజయనగరం జిల్లా వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు బెల్లాన వంశీకృష్ణ, చీపురుపల్లి సర్పంచ్ మంగళగిరి సుధారాణి, చీపురువల్లి మండల వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనువాస నాయుడు, చీపురుపల్లి మండల వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - చీపురుపల్లి: విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలంలో శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం యొక్క హుండీలను లెక్కించారు. సహాయ కమీషనరు వారి కార్యాలయం సీనియర్ సహాయకులు జి.శ్యామ్ ప్రసాద్ విజయనగరం వారి సమక్షంలో లెక్కించారు. ఈనెల 1 నుంచి 27వ తేదీ వరకు రూ.204371.00 వచ్చింది. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాస్, చైర్మన్ ఇప్పిలి సూర్య ప్రకాష్, వైస్ చైర్మన్ వెంకట కుమార స్వామి, వంకల కృష్ణ, రేగిడి అప్పలనాయుడు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడం పట్ల హర్షం

విశాలాంధ్ర - పార్వతీపురం: దళిత క్రైస్తవుల సామాజిక, ఆర్థిక న్యాయం కోసం ఎస్సీ హెూదా కల్పిస్తూ శాసనసభ తీర్మానం చేయడంపట్ల రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆమె పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా ఆంధ్ర ప్రదేశ్‌లో తీర్మానం చేయగా, నేడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగ్మోహన్‌రెడ్డి చట్టసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీలు మతమార్పిడి వలన వారి ఆర్థిక,సామాజిక పరిస్థితుల్లో ఎటువంటి మార్పు రాదని గుర్తించి తీసుకున్న నిర్ణయం బాగుందని మెచ్చుకున్నారు. ఎస్సీ, ఎస్టీలకు వైఎస్సార్సీపీకి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నదని వివరించారు.

పిడుగుపాటుకు యువతి మృతి

విశాలాంధ్ర - బెలగాం: పిడుగుపాటుకు గురై యువతి మృతి చెందగా మరో యువతికి గాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామానికి చెందిన పత్ర మౌనిక (17) తన స్నేహితురాలు కిలారి కావ్యతో కలసి ఊరి చివర మామిడి తోట వద్దకు బహిర్భుమికి వెళ్లి వస్తుండగా ఈదురు గాలులు పిడుగులు కురిసాయి. ఈసంఘటనలో పిడుగుపాటుకు గురైన మౌనిక అక్కడికక్కడే మృతిచెందగా కావ్య అస్వస్థతకు గురైంది. ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. మౌనిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రి మార్చ్యురీకి తరలించారు. మృతి చెందిన మౌనిక పార్వతీపురంలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది.

బాధితులకు పరామర్శ

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఎపిజెఎసి అమరావతి జిల్లా శాఖ చైర్మన్ జి. శ్రీరామమూర్తి, సహాధ్యక్షులు జి. చంద్రమౌళి, ఆర్. రమణ మూర్తి బాదితుల ఇండ్ల పరామర్శలో భాగంగా సోమవారం బొంగు శివప్రసాద్‌ను (ఆర్టీసీ డ్రైవర్, పార్వతీపురం డిపో) పరామర్శించారు. అతనికి 2021 ఆగస్టులో ఇన్ఫెక్షన్ వచ్చి కుడి కాలు తీసివేయగా ఉద్యోగానికి పనికిరావని చెప్పి మరియే ఉద్యోగం ఇవ్వకుండా, ఎటువంటి డబ్బులు ఇప్పటివరకు ఇవ్వలేదు ఇంకా 10 సంవత్సరాలు సర్వీసు వున్నదని తెలియజేస్తు ప్రభుత్వం వారు ఆదుకోవాలని ఈసందర్భంగా వారు కోరారు. అలాగే పి. దివాకర్ పార్వతీపురం ఆర్టీసీ డిపోలో ఎడిసిగా పనిచేసి పదవీ విరమణ చెందిన అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. తను 2021 నవంబరులో పదవీ విరమణ కాబడి అనారోగ్యానికి గురయ్యారు. ప్రస్తుతం డయాలిసిస్ పేషెంట్ గా వున్నట్లు అతనికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏమి రాలేదని ప్రభుత్వం నుండి ఎటువంటి డబ్బులు ఇప్పటివరకు అందలేదని అతని భార్య ప్రశాంతి కుమారి తెలపగా ప్రభుత్వం ఇద్దరినీ ఆదుకోవాలని వారు కోరారు.

31న సాలూరులో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర - సాలూరు రూరల్: ఉపాధి కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్చి 31న మెగా జాబ్ మేళా నిర్వహించబడుతుందని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. శుక్రవారం ఉదయం స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్ నందు నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాబ్ మేళాకు 12 బహుళజాతి కంపెనీలు వస్తున్నందున నిరుద్యోగ యువతకు తమతమ అర్హతను బట్టి మెరుగైన ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ మాట్లాడుతూ పదవతరగతి నుంచి పిజి వరకు చదివిన 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు www.apssdc.in వెబ్‌సైట్ నందు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి.సురేష్, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, కొత్తవలస సర్పంచ్ ధర్మావతి, వైకాపా సీనియర్ నాయకులు దండి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఏపీ క్రీడాకారులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుల జట్టు సోమవారం రాజస్థాన్ బయలుదేరినట్లు న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ సహాయ కార్యదర్శి సిహెచ్. వేణుగోపాల్ తెలిపారు. ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు రాజస్థాన్‌లోని కోట యూనివర్సిటీలో జరగనున్న 38 వ సబ్ జూనియర్ మరియు క్యాడేట్ బాల బాలికల జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 43 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు . ఆంధ్రప్రదేశ్లోని పలు ఉమ్మడి జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఇటీవల విశాఖపట్నం జిల్లా ఎలమంచిలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి ఈ పోటీలకు ఎంపిక య్యారు. జట్టులో 20 మంది బాలికలు మరో 23 మంది బాలురు ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు.

శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి భాస్కర్ జట్టుకు మేనేజర్ గా , ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి అచ్యుత రెడ్డి కోశాధికారి బి.అర్జునరావు, ఉపాధ్యక్షులు ములంపాక అచ్చం నాయుడు తదితరులు అభినందనలు తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

విశాలాంధ్ర - పాచిపెంట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. పాచిపెంట మండల కేంద్రంలో సోమ వారం జరిగిన వై.ఎస్.ఆర్. ఆసరా కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్ర మాలు అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వై.ఎస్.ఆర్ ఆసరా, జగనన్న చేయూత తదితర పథకాలు ప్రభుత్వం అమలు చేస్తూ మహిళల ఆర్థిక ప్రగతికి సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. వై.ఎస్.ఆర్.ఆసరా కార్యక్రమం క్రింద మూడవ విడతలో జిల్లాలో 16,646 స్వయం సహాయక సంఘాలకు చెందిన 1,83,077 మంది సభ్యులకు రూ.94.18 కోట్లు ఆసరా నిధులు జమ అయ్యాయన్నారు. సాలూరు నియోజక వర్గంలో 3585 సంఘాలకు చెందిన మహిళకు రూ.16.64 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంటల వ్యవధిలో సమస్యలు పరిష్కరించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం మండలం జమదాల సచివాలయం జమ్మిడవలస గ్రామంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి గ్రామ ప్రజలు పలు సమస్యలను తీసుకురాగా 24 గంటల వ్యవధి లోపలనే ఆయా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకోవడం జరిగింది. సమస్యలలో ప్రధానంగా గ్రామంలో రెండు చేతి పంపు బోర్లు పనిచేయడం లేదని చెప్పగా వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సోమవారం ఉదయాన్నే వా టిని బాగు చేయించి ప్రజలకు మంచి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. గ్రామ ప్రజలంతా తమ గ్రామానికి రచ్చ బండ కావాలని కోరిన 24 గంటల లోపలనే గ్రామం నడిబొడ్డున రచ్చబండ నిర్మాణానికి అవసరమైన అనుమతులు, నిధులు మంజూరు చేయడంతో పాటుగా సోమవారం నాడు స్వయానా ఆయన చేతుల మీదుగా భూమి పూజ చేసి నిర్మాణ పనులు ప్రారంభం చేశారు. తమ గ్రామ సమస్యలను చెప్పిన కొన్ని గంటల వ్యవధి లోపలనే వాటిని పరిష్కరించిన ఎమ్మెల్యే జోగా రావుకు గ్రామ ప్రజలంతా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, గ్రామ సర్పంచ్ జి. రాజు, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి చైర్ పర్సన్ ఎం. భాగ్యశ్రీ, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, వైసిపి సీనియర్ నాయకులు బలగ నాగేశ్వరరావు, భీమవరపు కృష్ణమూర్తి, వి. గుర్రాజు, గ్రామ నాయకులు నల్లం నాయుడు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓ పోటీ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నిరంతరం పోటీపరీక్షల్లో తమ విద్యార్థులు ముందంజలో ఎన్నడూ ఉంటారని ఇందులో భాగంగా ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ ఫలితాలలో పట్టణంలో రింగ్ రోడ్డు వద్ద ఉన్న శ్రీ చైతన్య పాఠ శాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారని పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకులు వి శ్రీనివాసరావు తెలిపారు. వీటికి సంబంధించిన వివరాలను సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐదవ తరగతి చదువుతున్న వి రోషన్ గ్రాండ్ ప్రైజ్ మనీ లాప్ టాప్ సాధించారని, 6,7 తరగతులు చదువుతున్న జయంత్, మనోజ్ఞ లో ప్రథమ బహుమతి సాధించారని తెలియజేశారు. వీరితోపాటు తృతీయ బహుమతితో పాటు 146 మంది విద్యార్థులు గోల్డ్ మెడల్ 30 మంది కన్సోలేషన్ బహుమతులు సాధించారని తెలియజేశారు. ఇంతటి విజయాలు సాధించిన విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదం డ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతున్నామన్నారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జగదీష్, డీన్ లు సాయి కిషోర్, సత్యనారాయణ ,అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : శృంగవరపుకోట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి ఎంపీడీవో శేషుబాబుకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు యూనియన్ జిల్లా అధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, సిఐటియు జిల్లా మండల కమిటీ నాయకులు చెలికాని ముత్యాలు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని సూర్యనారాయణ, కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ ఎన్ఎంఎస్ఎస్ యాప్ రద్దు చేయాలని,రెండు పూటలా పనిని రద్దు చేయాలని, ఒక్క పూట పనిని కొనసాగించాలని, బకాయి బిల్లులు చెల్లించాలని, రోజువారి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సంవత్సరంలో 200 రోజులు పని దినాలు కల్పించాలని, పాత పద్ధతుల్లో సమ్మర్ అల్వెన్స్ తో పాటు ఇతర అలవెన్సు ఇవ్వాలని, పనిచేసిన కార్మికులకు పే స్లిప్పులు ఇవ్వాలని, కార్మికులకు కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేసి బోర్డు నుంచి బెనిఫిట్స్ వర్తింపజేయాలని, దారి మళ్లించిన బోర్డులో నిధులను బోర్డులో చేర్చాలని డిమాండ్ చేశారు.

పోలియో నిర్మూలనకు నిధులు సేకరించాలి

రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తీక్

విశాలాంధ్ర - బొబ్బిలి: ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలనం కోసం రోటరీ అంతర్జాతీయ సంస్థ చేస్తున్న కృషిని ముందుకు తీసుకొని వెళ్ళేందుకు రోటరీ సభ్యులు నిధులను సేకరించాలను బొబ్బిలి రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తిక్ పిలుపునిచ్చారు. సోమవారం సూర్య రెసిడెన్సీ నందు రోటరీ క్లబ్ జనరల్ అసెంబ్లీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు జె సి రాజు మాట్లాడుతూ బొబ్బిలి రోటరీ నుండి పోలియో నిర్మూలాన నిధులు పెద్ద ఎత్తున సేకరించి రోటరీ అంతర్జాతీయ సంస్థకు పంపాలన్నారు. విద్యాసంస్థలను, విద్యార్థులను, వివిధ కార్యాలయాల సిబ్బందిని, దాతలను సంప్రదించి నిధులు సేకరించాలని కోరారు. అలాగే నీరు మరియు పారిశుద్ధ్యం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. కార్య క్రమంలో కార్యదర్శి శ్రీ హరి, కోశాధికారి, శ్రీనివాసన్, చంద్ర కిషోర్, రామ కృష్ణ, నాగ రాజు, సజ్జ అప్పల రాజు సభ్యులు పాల్గొన్నారు.

మోడీ పాలనకు చరమగీతం పాడాలి

విశాలాంధ్ర - గుర్ల: మోడీ పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జమ్ము ఆదినారాయణ పతివాడ గోవిందు అన్నారు. సోమవారం నరేంద్ర మోడీ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. అదేవిధంగా నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్ గాంధీ రాబోయే రోజుల్లో ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్ల, చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు ఎస్ఎంఎస్ మెసేజ్

విశాలాంధ్ర - పార్వతీపురం: 2022-23 రబీ పంటకు సంబంధించి ఈ పంట నమోదు చేసుకున్న వెంటనే నేరుగా రైతుల సెల్ ఫోన్లకు ఎస్ఎంఎస్ మెసేజ్ వస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె.రాబర్ట్ పాల్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దీనికి సంబంధించి మన్యం జిల్లాలోని పాచిపెంట మండలం పనసపెద్దికొనవలస గ్రామానికి చెందిన రైతు వివరములు వెల్లడించారు. ఈ-క్రాప్ నందు బుకింగ్ నంబరు 236870856 తో గూనాపు ఉష సర్వే నెంబర్ 70-5 లో 0.2000 ఎకరములలో సాగుచేసిన ఉలవలపంట నమోదుకుసంబందించి వచ్చిన మెసేజ్ చూపించారు. రైతులకు ధన్యవాదములను కూడా ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ శాఖ- ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తెలియ జేస్తున్నట్లు ఈ ఎస్ ఎం ఎస్ మెసేజ్ ద్వారా వస్తుందన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానం వాడుతూ వారికి అన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి చెత్త సంపద తయారీపై శిక్షణ

విశాలాంధ్ర - సీతానగరం: మండల కేంద్రములోని పెదబోగిలి గ్రామ పంచాయతీ చెత్త సంపద కేంద్రం వద్ద మంగళ, బుధవారాల్లో రెండురోజుల పాటు చెత్తనుండి సంపద తయారు చేయుటపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు ఈఓపిఆర్డీ కెకెకె వర్మ తెలిపారు. జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఎంపిక చేసిన పంచాయతీలనుండి సర్పంచ్, కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయ, పశువైద్య సహాయకులకు,క్లాప్ మిత్రలకు శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. జియ్యమ్మవలస, పార్వతీపురం, గరుగుబిల్లి, కొమరాడ, బలిజిపేట, సీతానగరం మండలాలకు చెందినవారికి శిక్షణ ఉంటుందని తెలిపారు.

సెంచూరియన్‌లో సేంద్రీయ వ్యవసాయ నమూనాకు నాబార్డు సాయం

విశాలాంధ్ర - నెల్లిమర్ల: సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఒక ఎకరా స్థలంలో సేంద్రీయ వ్యవసాయ నమూనా చేపడితే దానికి నాబార్డ్ చేయూతనందిస్తుందని నాబార్డ్ డిడిఎం టి.నాగార్జున స్పష్టం చేశారు. సోమవారం ఆయన సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించి టిష్యూ కల్చర్, సేంద్రీయ వ్యవసాయం, పొద్దు తిరుగుడు, వర్మి కంపోస్ట్, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం ఇంటర్న్ షిప్ చేస్తున్న బీఎస్సీ వ్యవసాయ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ఆయనను సత్కరించారు.

నేడు ఆటో బహిరంగ వేలం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట పోలీసు స్టేషన్ ఆవరణలో మంగళవారం ఉదయం10 గంటలకు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఆధ్వర్యంలో క్రైమ్ నెంబర్ 260/20 ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ఆటోను బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్.ఐ జె.తారకేశ్వరరావు సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ వేలం పాటలో ఔత్సాహికులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా యర్రమ్మ పేరంటాలు తీర్థం

విశాలాంధ్ర - జామి: మండల కేంద్రమైన జామిలోని. కొత్తలి వారి రామ కోవెల వద్ద గొస్తనీ నది ఒడ్డున వున్న శ్రీ యర్రమ్మ పేరంటాలు తీర్థం సోమవారం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా ఏరువాక పండుగ సందర్భంగా ఈ అమ్మవారి తీర్థం జరుగుతుంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పసుపు ,కుంకుమలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద మహిళలు కోలాటం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : మోటార్ సైకిల్ స్కిడ్ అయి ముగ్గురకు తీవ్ర గాయాలైన సంఘటన జరిగింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమరాడ మండలం బొడ్డవలస గ్రామానికి చెందిన పువ్వల రాము తన స్నేహితులు కద్రక జనార్ధన్, రాయగడ గ్రామానికి చెందిన అఖిల్ లతో కలసి జంఝావతి కూడలి నుండి బొడ్డవలస గ్రామానికి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా రాజ్యలక్ష్మిపురం కోనవలస గ్రామాల మధ్య మలుపు వద్ద మోటార్ సైకిల్ స్కిడ్ అయి క్రింద పడడంతో ముగ్గురకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆటోలో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం పంచాయతీ శివారు భర్తవానిపాలెం గ్రామానికి చెందిన కొల్లి అప్పలనాయుడు (48) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వల్లంపూడి ఎస్ఐ కే.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం విశాఖలో నివాసం ఉంటున్న అప్పలనాయుడు స్వగ్రామం భర్తవానిపాలెంలో జరుగుతున్న పండగలో పాల్గొనేందుకు ఈనెల 21న వస్తుండగా బల్లంకి బానాది రోడ్డులో అడ్డంగా కుక్క రావడంతో కిందపడిపోయి తలకు తీవ్ర గాయం కాగా విశాఖ తరలించి ఆస్పత్రిలో చికిత్సలు అందించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారు జామున ఒంటిగంట సమయంలో అప్పలనాయుడు మృతి చెందాడు. ఈ మేరకు మృతుడు భార్య శ్రీలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేష్ తెలిపారు.

నేడు పోలమాంబ ఆలయం వద్ద చండీహెూమం



విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా పార్వతీపురం మక్కువ మండలం సంబర గ్రామంలో పవిత్ర గోముఖీ నదీ తీరమున స్వయం వ్యక్తమై వెలసిన ప్రముఖ ఇలవేల్పు, ఆరాధ్య దేవత శ్రీశ్రీశ్రీ పోలమాంబ అమ్మవారి జాతర మహెూత్సవములు సందర్భంగా మంగళవారం అమ్మవారి వనం గుడి వద్ద చండీ హెూమం, మహా అన్నదానం జరుగుతుందని ధర్మకర్తమండలి చైర్మన్ పూడి దాలినాయుడు తెలిపారు. భక్తులు యావన్మంది విచ్చేసి చండీ హెూమం, మహా అన్నదానం కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదం స్వీకరించాలన్నారు.